
అడవికి రక్షకులు..!



వారు అడవితల్లి బిడ్డలు.. వన్యమృగాల మధ్య అడవి సింహాలు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవితల్లి రక్షణకు అడుగడుగునా గస్తీ నిర్వహిస్తున్నారు. నరికి వేతకు గురికాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. 8లో▸



అభివృద్ధిలో పోలీసుల కీలక పాత్ర

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సురక్ష దినోత్సవం నిర్వహించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.8 /29.6

ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. పగలు వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి కూడా వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నిర్మల్ రూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్‌లో 17 మంది విద్యార్థులు, సెకండ్ లాంగ్వేజ్–8 మంది, గణితం–38, సైన్స్–36, సోషల్–14 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈనెల 20తో పరీక్షలు ముగుస్తాయి. ఇప్పటికే హాల్ టికెట్లను సంబంధిత ప్రధానోపాధ్యాయులు అందజేశారని, ఆన్‌లైన్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు తక్కువగా ఉన్న దృష్ట్యా జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్‌లోని బాలికల పాఠశాలలో మాత్రమే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నిర్మల్ రూరల్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించారు. ఫస్ట్ ఇయర్‌లో మొత్తం 1,209 మంది విద్యార్థులకు, 1149 మంది హాజరయ్యారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 166 మందికిగాను 140 మంది హాజరు హాజరవగా 26 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 1,375 మంది విద్యార్థులకు 1,289 మంది హాజరయ్యారు. 86 మంది గైర్హాజరయ్యారు. సెకండియర్‌లో మొత్తం 362 మంది విద్యార్థులకు 335 మంది హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 52 మంది విద్యార్థులకు 47 మంది హాజరవగా, ఒకేషనల్ కేటగిరీ 414 మంది విద్యార్థులకు 382 మంది హాజరయ్యారని ఇంటర్ అధికారి పరుశురాం తెలిపారు.

గెస్ట్ టీచర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని సోఫినగర్ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో గెస్ట్ టీచర్ల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నీరడి గంగశంకర్ తెలిపారు. బోధనలో అనుభవం ఉండి పీజీ, బీఈడీలో 55% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ పీజీటీ–1, పాఠశాలలో తెలుగు టీజీటీ–1, ఇంగ్లిష్ టీజీటీ–1, హిందీ పీజీటీ–1, గణితం పీజీటీ–1, టీజీటీ–1, ఫిజికల్ సైన్స్ పీజీటీ–1, బయాలజీ సైన్స్ పీజీటీ–1, జనరల్ సైన్స్ టీజీటీ–1, పీఈటీ–1 ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఈనెల 16వ డెమో ఉంటుందని తెలిపారు. బోధనానుభవం ఉన్న మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9908016859 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈవో

లక్ష్మణచాంద: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను డీఈవో రవీందర్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. వేసవి సెలవుల అనంతరం సోమవారం నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా మండలంలోని వడ్యాల్, పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. వడ్యాల్ పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈవిద్యా సంవత్సరం నుంచి పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలు కూడా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలు ఉన్న రాగి జావాను అందచేయడం జరుగుతుందన్నారు. మన ఊరూ–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం మండలంలోని పీచర ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. మధ్యాహ్న సమయంలో వచ్చిన ఆయన విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించిన యూనిఫాంను పరిశీలించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అశోక్ వర్మ, విద్యారాణి, ఉపాధ్యాయులు అరవింద్‌కుమార్, నర్సయ్య, హంసలత, సీఆర్పీ సుధాకర్ తదితరులు ఉన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న తరగతి గది కుంటాల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోనిది. ఎండల కారణంగా ఈ పాఠశాలకు సోమవారం ఒక్క విద్యార్థి కూడా రాలేదు. ఉపాధ్యాయులు మాత్రం అందరూ హాజరయ్యారు. ఉపాధ్యాయులు గ్రామంలోకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడగా.. ఎండలు తగ్గిన తర్వాతనే పిల్లలను బడికి పంపిస్తామని తెలిపారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న బడి దస్తురాబాద్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల. మన ఊరు– మనబడి కార్యక్రమం కింద పనులు చేపడుతున్నారు. గత సంవత్సరం ప్రారంభమైన పనులు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా పూర్తి కాలేదు. ఈ కార్యక్రమం కింద మండల పరిధిలో మొత్తం ఐదు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. దస్తురాబాద్ ప్రాథమిక పాఠశాలలో మాత్రమే పనులు పూర్తయ్యాయి.





ఈ చిత్రం కుంటాల మండలం గామాపూర్ ప్రాథమిక పాఠశాలలోనిది. తొలి రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాటి గంగాధర్ బడిని చీపురుతో శుభ్రపరిచారు. గత సంవత్సరమే ప్రభుత్వం స్వీపర్లను తొలగించింది. దీంతో ఆ భారం ఉపాధ్యాయులపై పడింది. పంచాయతీ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తానే పాఠశాలను శుభ్రం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గంగాధర్ తెలిపారు.

బడిగంట మోగింది!

- ప్రారంభమైన కొత్త విద్యా సంవత్సరం
- తొలిరోజు అంతంత మాత్రమే విద్యార్థుల హాజరు
- స్వాగతం పలికిన సమస్యలు
- ఇంకా పూర్తికాని 'మనబడి'
- శిథిలావస్థలో తరగతి గదులు
- మూత్రశాలలూ లేని పాఠశాలలు

సాక్షి విజిట్



కొండాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రేయర్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: బడిగంట మోగింది.. వేసవి సెలవులు ముగియడంతో సోమవారం బడులు తెరుచుకున్నాయి. సుమారు నెలన్నర పాటు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు పుస్తకాల సంచి భుజానికి వేసుకుని బడిబాట పట్టారు. అయితే ఎండల ప్రభావంతో తొలిరోజు విద్యార్థుల హాజరు చాలా తక్కువగా నమోదైంది. హాజరైన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. బడికి వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పూలతో స్వాగతం పలికారు. ఇప్పటికే మొదటి విడత బడిబాట కార్యక్రమం జిల్లాలో పూర్తికాగా, సోమవారం కొత్తగా మరికొంతమంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా 'సాక్షి' పలు పాఠశాలలను సందర్శించింది.

తొలిరోజు హాజరు అంతంతే..

కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైన సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు చాలా తక్కువగా కనిపించింది. ప్రైవేట్ పాఠశాలలు, ప్రాథమిక విద్యార్థులకు ఒంటిపూట మాత్రమే నిర్వహించారు. ఎండల కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపడానికి సాహసం చేయలేదు. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే మరో వారంపాటు విద్యార్థుల హాజరు శాతం అంతంతే ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 65 వేల మంది విద్యార్థులకుగాను 20 వేల విద్యార్థులు హాజరైనట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూస్తామన్నారు. ఉపాధ్యాయులు మాత్రం లైవ్ లొకేషన్ ఆధారంగా మెజార్టీ సంఖ్యలో బడులకు హాజరయ్యారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి



క్యారమ్ ఆడుతున్న చిన్నారులు

శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది..

దాదాపు 45 రోజులపాటు పాఠశాలలు మూసి ఉండడంతో బడుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. శుభ్రం చేయడానికి గతంలో స్వీపర్లు ఉండగా.. గత సంవత్సరం వారిని ప్రభుత్వం తొలగించింది. దీంతో కొన్ని పాఠశాలల్లో పంచాయతీ సిబ్బందితోనే గదులు, పరిసరాలు శుభ్రం చేయించారు. మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులే శుభ్రం చేసుకున్నారు. తానూరు మండలం ఎల్వి పాఠశాల, సారంగాపూర్ మండలం జామ్ పాఠశాలల్లో స్వీపర్ లేకపోవడంతో పంచాయతీ కార్మికులు పాఠశాలను శుభ్రం చేశారు.

ముగిసిన మొదటి విడత బడిబాట..

జిల్లాలో ఈనెల 3 నుంచి 7 వరకు మొదటి విడత బడిబాట కార్యక్రమం కొనసాగింది. ఇందులో మొత్తం 3,661 మంది విద్యార్థులు కొత్తగా జాయిన్ అయ్యారు. 1,257 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. సోమవారం మరో వందకుపైగా విద్యార్థులు కొత్తగా జాయిన్ అయినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ..

పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలోని దాదాపు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

అసంపూర్తిగా 'మనబడి'..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు – మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 260 పాఠశాలలను మొదటి విడతగా ఎంపిక చేశారు. ఇప్పటి వరకు 72 బడుల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా 188 పాఠశాలల్లో పనులు వివిధ దశలలో జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు కొనసా..గుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు, నీటి వసతి లేక ఇబ్బంది పడ్డారు. సోన్ మండలం వెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.30 లక్షల ప్రొసీడింగ్ వచ్చినప్పటికీ టాయిలెట్లు, బాత్‌రూం నిర్మాణం జరగలేదు. మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయులు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

సమస్యలు పరిష్కరించండి సారూ..

- 'ప్రజావాణి'లో పలువురి వేడుకోలు..
- చర్యలు తీసుకుంటామన్న అడిషనల్ కలెక్టర్ రాంబాబు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 35 మంది వచ్చి అర్జీలు పెట్టుకున్నారు వాటిని అదనపు కలెక్టర్ రాంబాబు స్వయంగా స్వీకరించారు. సమస్య తెలుసుకుని సంబంధిత శాఖ అధికారులకు అర్జీలు అందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంతో ఆశతో కలెక్టరేట్ తలుపు తడుతున్న వారికి న్యాయం చేయాలని పేర్కొన్నారు.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి...

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని భారతీయ కిసాన్ సంగ్ తెలంగాణ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. పశువుల ఆధారంగా వ్యవసాయం చేసే గ్రామీణ రైతులకు, ఉపాధి హామీ పథకం క్రింద నెలకు 10 రోజులు ఆర్థిక సహాయం చేయాలన్నారు.

అధికారులు సహకరించడం లేదు

ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన మాకు రెండో విడత గొర్రెల పంపిణీలో 18 యూనిట్లు మంజూరయ్యాయి. ఈనెల 5న గొర్రెల కొనుగోలు కోసం అధికారులు మమ్మల్ని గుంటూరు తీసుకెళ్లారు. మూడు రోజులు నెల్లూరు, కడప మాచర్లలో గొర్రెల కోసం తిరిగాం. అధికారులు సహకరించకపోవడంతో గొర్రెలు కొనుగోలు చేయకుండానే తిరిగి వచ్చాం.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి..

నిర్మల్ పట్టణంలోని కంచరోని చెరువు శిఖం భూమిని ఆక్రమించి చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్, ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కొందరు వ్యక్తులు చెరువు తూమును ధ్వంసం చేసి, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న శిఖంలో షాపింగ్ కాంప్లెక్స్, ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు.

డిజిటల్ సైన్ కావట్లేదు...

మాకు జిల్లా కేంద్రంలోని విశ్వనాథపేట్ శివారులోని సర్వే నంబర్ 90 మా నాన్నగారి పేరు మీద భూమి ఉంది. ఇటీవల ఆయన మరణించడంతో భూమి మార్పు కోసం దరఖాస్తు చేసుకున్నాం. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయం నుంచి జనవరిలో కలెక్టర్ లాగి న్‌కు వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ కలెక్టర్ లాగిన్‌లో అప్రూవ్ కాలేదు. భూమి మా పేరు మీద పట్టా అయ్యేలా చూడాలి. – బోరిగామ రామరాజు, నిర్మల్

ఆరోగ్య సందేశం కోసమే పరుగు



రన్‌లో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్ కుమార్

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు, డాక్టర్లు

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య సందేశం ఇవ్వడానికి ప్రభుత్వం పోలీస్ శాఖ ద్వారా తెలంగాణ రన్ నిర్వహించిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం 2కే రన్ నిర్వహించారు. ముందుగా పావురాలను, మూడు రంగుల బెలూన్లను గాల్లోకి వదిలారు. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి శివాజీ చౌక్ మీదుగా, తిరిగి స్టేడియం వరకు ఈ రన్ కొనసాగింది. కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రన్‌ను ప్రారంభించి, పాల్గొన్నారు. ఏడు పదుల వయసులోనూ మంత్రి అక్కడున్నవారితో పోటీ పడుతూ పరిగెత్తి యువకుల్లో ఉత్సాహం నింపారు. రన్ పూర్తి చేసుకున్న తర్వాత కలెక్టర్, ఎస్పీతో కలిసి చాయ్ తాగారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉదయం వాకింగ్, యోగా చేయాలని సూచించారు. ఈ రన్‌లో అందరికంటే ముందు లక్ష్యాన్ని చేరుకున్న ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐ మల్లేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, ప్రముఖ డాక్టర్లు దేవేందర్‌రెడ్డి, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం



మాట్లాడుతున్న న్యాయవాదులు


నిర్మల్‌టౌన్: అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ... పిల్లలు పనిలో కాకుండా బడిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వోస మహేందర్, కొమ్మోజి రమణ, వోడ్నం మధుకర్, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

ఖానాపూర్: బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. బాలకార్మిక నిర్మూలన దినోత్సవం పురష్కరించుకుని పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్‌లో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జితిన్‌కుమార్ హాజరై మాట్లాడారు. బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దన్నారు. ఈ సందర్భంగా బాలకార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సురేశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా.. జర జాగ్రత్త..!

- మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద
- ప్రముఖ కంపెనీల పేర్లతో ప్యాకెట్ల తయారీ
- నాలుగురోజుల కిందట మేడ్చల్‌లో పట్టుబడిన ముఠా
- అరెస్ట్ అయినవారిలో భైంసా వ్యాపారి



భైంసాటౌన్: వానాకాలం సాగు కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. వర్షాలు కురవగానే విత్తుకోవడానికి చేలను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే, మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద రైతులను వేధిస్తోంది. ఏవి బ్రాండెడ్‌వో, ఏవి నకిలీవో గుర్తించలేని విధంగా కొందరు నకిలీ విత్తన దందా నిర్వాహకులు ప్యాకెట్లు తయారు చేసి రైతులకు అంటగడుతున్నారు. ఇటీవల మేడ్చల్‌లోని ఓ గోదాంలో నకిలీ పత్తి విత్తనాలను బ్రాండెడ్ పాకెట్లలో నింపుతుండగా ఎస్‌వోటీ, మేడ్చల్, చేవెళ్ల పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా దాడి జరిపి పట్టుకున్నారు. అరెస్టు చేసిన 15 మంది ముఠాలో భైంసాకు చెందిన వ్యాపారి కూడా ఉన్నాడు. నకిలీ విత్తన దందాకు అతనే ప్రధాన సూత్రధారి అని పోలీసుల విచారణలో తేలడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సదరు వ్యాపారి ఇప్పటికే భైంసాకు సైతం నకిలీ విత్తన ప్యాకెట్లు సరఫరా చేసి విక్రయించి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రముఖ బ్రాండ్ల పేరిట..

మహారాష్ట్రకు సరిహద్దున ఉన్న ఇక్కడి ప్రాంత రైతులు ఎక్కువగా పత్తి, సోయా సాగుచేస్తారు. దీంతో పలు విత్తన కంపెనీల ప్రతినిధులు రైతులను ఆకర్షించే యత్నాలు చేస్తున్నారు. తమ కంపెనీ విత్తనాలు దిగుబడి, చీడపీడల బెడద తట్టుకుంటుందని ప్రచారం చేస్తున్నారు. కాగా, మార్కెట్‌లో వందల సంఖ్యలో కంపెనీల విత్తనాలు దర్శనమిస్తుండడంతో రైతులు ఏవి నాణ్యమైనవో తేల్చుకోలేకపోతున్నారు. నకిలీ విత్తనాలు సైతం బ్రాండెడ్ ప్యాకెట్లలో నింపి అమ్ముతున్నారు. తాజాగా అవి పట్టుబడడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగు రోజుల కిందట మేడ్చల్‌లోని ఓ గోదాంలో ఏకంగా 3.35 టన్నుల నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలను ప్రముఖ బ్రాండ్ల పేరుతో ఉన్న ప్యాకెట్లను అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో, ఇక్కడి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భైంసాకు చెందిన వ్యాపారి గుజరాత్‌కు చెందిన వ్యాపారితో పరిచయం పెంచుకుని, పలువురు వ్యాపార భాగస్వాములతో కలిసి అక్కడి రాష్ట్రంలో జన్యు పరీక్షలో విఫలమైన బీజీ 3/హెచ్‌టీ పత్తి విత్తనాలను తెలంగాణకు సరఫరా చేసి లాభాలు పొందాలనుకున్నట్లు పోలీసులు విచారణలో గుర్తించారు.

జిల్లాలో సాగు వివరాలిలా(అంచనా..)

సోయా	లక్ష ఎకరాలు
పత్తి	1.50 లక్షల ఎకరాలు

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొనాలి..

మేడ్చల్‌లో నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలు పట్టుబడిన ఘటనలో భైంసావాసి ఉన్న మాట వాస్తవమే. అయితే, భైంసాకు విత్తనాలు సరఫరా అయినట్లు మా దృష్టికి రాలేదు. ఈ నేపథ్యంలో రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. బిల్లు లేకుండా విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు. బిల్లుపై తప్పనిసరిగా లాట్ నంబర్ వేయించుకోవాలి. ఈ బిల్లును పంట చేతికొచ్చేవరకు రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

ప్రతీఒక్కరికి పోలీస్ రక్షణ

నిర్మల్‌టౌన్: జిల్లాలోని ప్రతీఒక్కరికి పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సహాయం కావాలనుకునే వారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు అయినా సమాచారం తెలియజేయాలని సూచించారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన వద్దు

నిర్మల్‌టౌన్: ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళన చెందొద్దని ఎస్పీ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 15 ఫోన్లను సీఈఐఆర్ వెబ్సైట్ ద్వారా పోలీసులు గుర్తించారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్ కుమార్ వాటిని బాధితులకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా మీసేవ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదట అదే నంబర్ కొత్త సిమ్ తీసుకుని www.ceir.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేసి ఫోన్ ఐఎంఈఐ నంబర్ అప్‌లోడ్ చేసి, రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ అని నమోదు చేసుకోవాలన్నారు. తర్వాత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి అందజేయడంలో కృషిచేసిన ఐటీ కోర్ విభాగం సిబ్బందిని అభినందించారు. ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సెల్ ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్

పాలిటెక్నిక్ ప్రవేశాలపై నేడు, రేపు అవగాహన

నిర్మల్ రూరల్: పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియపై ఈనెల 13, 14 తేదీల్లో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. కళాశాల, కోర్సుల ఎంపిక, వివరాలు తదితర అంశాలపై సమగ్ర సమాచారాన్ని నిపుణులైన అధ్యాపక బృందం అవగాహన కల్పిస్తుందని తెలిపారు. నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ సెక్రెటరీ



విద్యార్థులతో ప్రమీల నాయక్

బోథ్: మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలికల పాఠశాలను రాష్ట్ర కార్యాలయ డిప్యూటీ సెక్రెటరీ ప్రమీలనాయక్ సోమవారం సందర్శించారు. వేసవి సెలవులు ముగిసిన తర్వాత విద్యార్థులు పాఠశాలకు వచ్చిన సందర్భంగా వారితో మాట్లాడారు. వేసవి సెలవులు ఎలా వినియోగించుకున్నారో వారు తెలియజేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మారుమూల ప్రాంతంలో ఉన్న పాఠశాలలో ఉన్నత విద్య అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నందున ప్రిన్సిపాల్ సువర్ణలతను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

'ఏక్‌భారత్ శ్రేష్ట్ భారత్' శిబిరానికి ఎంపిక


గైక్వాడ్ నగేశ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన గైక్వాడ్ నగేశ్ పంజాబ్‌లో జరిగే ఎన్‌సీసీ (ఏక్‌భారత్ శ్రేష్ట్ భారత్) శిబిరానికి ఎంపికయ్యాడు. ఈనెల 11 నుంచి జూలై 21 వరకు ఈ శిబిరం ఉంటుందని నగేశ్ తెలిపాడు. ఇచ్చోడ జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థి ఈ శిబిరానికి ఎంపిక కావడంపై హెచ్‌ఎం రాథోడ్ ఉదయ్‌రావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ కూచిపూడి నృత్యపోటీల్లో ప్రతిభ


నృత్య ప్రదర్శన చేస్తున్న హాశ్విత

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన గుండేటి హాశ్విత ఆన్‌లైన్ కూచిపూడి నృత్య పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యూజిషియన్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఆన్‌లైన్ నృత్య పోటీల్లో తృతీయ స్థానం దక్కించుకుంది. ఆదివారం రాత్రి జరిగిన పోటీల్లో బాలకేంద్రానికి చెందిన పలువురు చిన్నారులు పాల్గొనగా హాశ్విత జూనియర్స్ విభాగంలో మూడో స్థానంలో నిలిచింది. సోమవారం బాలకేంద్రం తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు గడ్డం రవీందర్, ఉపాధ్యక్షురాలు సృజన, కల్చరల్ ఆర్గనైజర్ కొంకటి శ్రవణ్ తదితరులు ఆమెను సన్మానించి అభినందనలు తెలిపారు. బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తదితరులు ఉన్నారు.

వారు అడవితల్లి బిడ్డలు.. వన్యమృగాల మధ్య అడవి సింహాలు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవితల్లి రక్షణకు అడుగడుగునా గస్తీ నిర్వహిస్తున్నారు. నరికి వేతకు గురికాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. కుటుంబానికి దూరంగా ఉంటూ.. అడవి తల్లికి అంగరక్షకులుగా పని చేస్తున్నారు. అడవి జంతువులను కాపాడటంలోనూ శ్రద్ధ చూపుతున్నారు. ఇలా ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తున్న బేస్‌క్యాంప్ సిబ్బందిపై కథనం.. –జన్నారం


అడవిలో గస్తీ తిరుగుతున్న సిబ్బంది

అడవికి రక్షకులు..!

- రాత్రీపగలు అడవిలోనే గస్తీ
- తగ్గిన కలప అక్రమ రవాణా
- బేస్‌క్యాంప్ సిబ్బంది పనితీరు భేష్


గొండుగూడ బేస్‌క్యాంపు

నాలుగేళ్ల క్రితం ప్రారంభం

కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం. దట్టమైన అడవులు, వివిధ వన్యప్రాణులకు నిలయం. ఇక్కడ స్మగ్లింగ్ పెరుగుతుందనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బేస్‌క్యాంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంపునకు ఐదుగురిని నియమించారు. ప్రస్తుతం జన్నారం అటవీ డివిజన్‌లో 13, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 49 బేస్‌క్యాంపులున్నాయి. వీటిద్వారా 245 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరితో పాటు 59 మంది ఎనిమల్ ట్రాకర్స్ కూడా పని చేస్తున్నారు. ఏడు స్ట్రైకింగ్ ఫోర్స్‌లలో కూడా మరో 35మంది విధులు నిర్వహిస్తున్నారు.

జీత భత్యాలు.. సెలవులు

ఒక్కొక్కరికి రూ.12,046 వేతనం, రూ.3,380 ఫుడ్ అలవెన్స్ ఇస్తారు. రూ.900 ఈపీఎఫ్, ఇతర కటింగ్‌లు పోను సుమారు రూ.14 వేలు చెల్లిస్తారు. సిబ్బంది వారానికొకరు చొప్పున ఇళ్లకు వెళ్లాలి. ఒక వారం ఒకరు వెళ్తే.. మరో వారం మరొకరు వెళ్లాల్సి ఉంటుంది. అడవిలోపల ఉండే వారు మాత్రం నెలకోసారి వెళ్లివస్తుంటారు.

బేస్‌క్యాంపు సిబ్బంది విధులివీ..

బేస్‌క్యాంపు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమిస్తారు. 35 ఏళ్ల లోపువారికి 25 కిలోమీటర్ల నడక పరీక్ష, హెల్త్ ఫిట్‌నెస్ ద్వారా భర్తీ చేస్తారు. వీరు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పర్మినెంట్ బేస్‌క్యాంపులలో ఉంటూ ఉదయం 6నుంచి సాయంత్రం 8గంటల వరకు అడవిలో కేటాయించిన ప్రదేశంలో గస్తీ తిరగాలి. స్మగ్లింగ్‌ను నిరోధించాలి. వన్యప్రాణులను రక్షించాలి. వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు, కుంటలను పరిశీలించాలి. వేటగాళ్లు నీటి కుంటల వద్ద ఉచ్చులు పెట్టకుండా గమనించాలి. అడవిలో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించాలి. ప్రతీరోజు చుట్టూ 10 కిలో మీటర్ల దూరం వరకు నడుచుకుంటూ వెళ్లి అడవిని పరిశీలించాలి. చూసిన ప్రతీ అంశాన్ని మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలి. ఈ వివరాలు ప్రతీరోజు బీట్ అధికారి, సెక్షన్ అధికారి వీరి వద్దకు వెళ్లి తెలుసుకుంటారు. ఉన్నతాధికారులు వీరి పనితనాన్ని గమనిస్తారు. త్వరలో ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా వారి మూమెంట్‌ను గుర్తిస్తారు.

క్యాంపు వద్ద వసతులు..

గతంలో బేస్‌క్యాంపు సిబ్బందికి ఎలాంటి సౌకర్యాలు లేవు. నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. రాత్రి చీకట్లో ఉండేవారు. జిల్లా కన్జర్వేటర్ వినోద్‌కుమార్, ఎఫ్‌డీవో మాధవరావు బేస్‌క్యాంపులను పటిష్ఠం చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రతీ క్యాంపునకు పర్మినెంట్ గది ఏర్పాటు చేశారు. వారితో పాటు బీట్ గార్డు ఉండేలా గదులు నిర్మించారు. ప్రతీ క్యాంపు వద్ద సోలార్ లైట్, మంచె, నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. రాత్రి మంచెపై గస్తీ నిర్వహించడంతోపాటు విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.

గస్తీ విధులు ఇలా..

ఉదయం ఆరు గంటలకు నిద్ర లేస్తారు. వంట పాత్రలు శుభ్రం చేసి వండుకుంటారు. టిఫిన్ బాక్సులు, నీళ్ల బాటిళ్లతో అడవులకు బయలు దేరుతారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా అడవిలో ఎంచుకున్న ప్రాంతంలో తిరుగుతారు. వారి బేస్‌క్యాంపుల పరిధిలో నీటి చెలిమెలు, సాసర్ ఫిట్స్, జంతువుల కదలికలను గుర్తిస్తారు. ఆకలైన చోట అన్నం తింటారు. తిరిగి విధులు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలలోపు తిరిగి క్యాంపునకు చేరుకుంటారు. భోజనం అనంతరం రాత్రి పది గంటల దాకా గస్తీ నిర్వహిస్తారు. కలప నరికివేతకు స్మగ్లర్లు వస్తున్నారనే సమాచారం ఉంటే అటు వైపు వెళ్లి అక్కడే నిఘా పెడతారు. రాత్రంతా అక్కడే ఉంటారు. సమాచారం అధికారులకు చేరవేస్తారు. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో బారికేడ్లు, చెక్‌పోస్టులు, గేట్లు ఏర్పాటు చేశారు. రాత్రి క్యాంపులోని ఐదుగురిలో ఇద్దరు ఒక్కో గేటు వద్ద గస్తీ నిర్వహిస్తారు. ఒకరు బీట్ అధికారితో పాటు క్యాంపు వద్దే ఉంటారు. రాత్రి 10 తర్వాత అడవి జంతువులు, చిరుతపులుల, ఎలుగుబంట్ల అరుపులు వినిపిస్తాయి. మెకాలు, దుప్పులు అరుస్తాయి. వీరి పక్క నుంచే దుప్పులు, కొండగొర్లు, నీలుగాయిలు వెళ్తాయి. రాత్రి మంచె పక్కకు వస్తాయి. రాత్రి పూట అన్ని జంతువులూ కనిపిస్తాయి. అయినా వీరు జంకరు. బేస్‌క్యాంపుల ఏర్పాటుతో స్మగ్లింగ్ కొంతమేర తగ్గింది. రాత్రి వేళ సిబ్బంది గస్తీ తిరుగుతూ స్మగ్లర్లు వచ్చినట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇచ్చి పట్టిస్తారు. దీంతో కేసులు నమోదు చేస్తుండడంతో స్మగ్లింగ్ తగ్గింది.

చిరుతను దగ్గరగా చూసిన


ఎనిమిది నెలలుగా పని చేస్తున్న. ఒకరోజు గస్తీలో ఉండగా రాత్రి 9గంటలకు చిరుతపులి 150 మీటర్ల దూరంలో కనిపించింది. అది నన్ను చూడలేదు కాబట్టి బతికిపోయా. రాత్రివేళ ఎన్నో వన్యప్రాణులు కనిపిస్తాయి. అలవాటైంది. ఇప్పుడా భయం కూడా పోయింది. – కోవ దౌలత్‌రావు, మల్యాల బేస్‌క్యాంప్ సిబ్బంది

సౌకర్యాలు బాగున్నయ్


మాది కెరమెరి మండలం చౌపాన్ గూడ. రెండేళ్లుగా పని చేస్తున్న. గతంలో సౌకర్యాలు లేవు. ఇప్పుడు క్యాంపు దగ్గర సోలార్ లైట్ పెట్టిచ్చిన్రు. బోరింగు వేయించిన్రు. బాత్‌రూంలు, పర్మినెంట్ రూమ్ కట్టిచ్చిన్రు. సౌకర్యాలు మంచిగున్నయ్. జీతం పెంచితే బాగుండు. – మడావి శేఖర్, మల్యాల బేస్‌క్యాంప్ సిబ్బంది

నిత్యం గస్తీ తిరుగుతం


రోజూ అడవిలో 10 కిలోమీటర్లు గస్తీ తిరుగుతం. వారానికోసారి అవసరమైన సరుకులు తెచ్చుకుంటం. ఉదయం వంట చేసుకుని అడవిలో గస్తీ తిరుగుతం. అడవిలో సీసీ కెమెరాలు, సోలార్ పంపులు, నీటి కుంటలు పరిశీలిస్తం. ఏదైనా ఇబ్బంది ఉంటే సార్లకు చెబుతం. – వసంతరావు, ఇందన్‌పల్లి బేస్‌క్యాంపు సిబ్బంది

స్మగ్లింగ్ తగ్గింది


బేస్‌క్యాంపు సిబ్బంది కారణంగా స్మగ్లింగ్ తగ్గింది. ఎప్పటికప్పుడు సిబ్బంది పనితీరు గమనిస్తున్నాం. విధుల్లో నిర్లక్ష్యం చేసినా, స్మగ్లర్లకు సహకరించినా తొలగిస్తాం. సిబ్బంది పని తీరు బాగుంటే తగిన ఫలితం ఉంటుంది. క్యాంపుల వద్ద వీరికి అన్ని సౌకర్యాలు కల్పించాం. – మాధవరావు, ఎఫ్‌డీవో

ఆసుపత్రిలో అడ్మిట్ చేసి వస్తుండగా..

- సీతాగోంది పెట్రోల్ పంపు వద్ద రోడ్డు ప్రమాదం
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- గంట వ్యవధిలో బాబాయ్ కూడా..
- ఇరు కుటుంబాల్లో విషాదం
- ఇద్దరికి ఒకేసారి అంత్యక్రియలు


ఏక్‌నాథ్ (ఫైల్)

గుడిహత్నూర్: తన బాబాయికి ఆరోగ్యం బాగా లేదని రిమ్స్‌లో అడ్మిట్ చేసి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ముర్కుటే ప్రభుదాస్ (51), ముర్కుటే ఏక్‌నాథ్ (45) మండలంలోని లింగాపూర్‌కు చెందిన వారు . బాబాయ్ వరుస అయిన ప్రభుదాస్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బంధువుల సహాయంతో ఏక్‌నాథ్ అతన్ని రిమ్స్‌కు తీసుకెళ్లాడు. వైద్యులు అడ్మిట్ చేసి చికిత్స చేస్తున్నారు. ఏక్‌నాథ్ అక్కడే ఉండి సపర్యలు చేశాడు. పని చేసి ఆయన వెంట వచ్చిన ముర్కుటే వినోద్‌తో కలిసి పల్సర్ బైక్‌పై ఆదివారం రాత్రి 11:30 గంటలకు ఇంటికి తిరుగు పయనమయ్యారు. జాతీయ రహదారి 44పై సీతాగోంది పెట్రోల్ పంపు సమీపంలో అదుపుతప్పి గుంతలో పడడంతో ఏక్‌నాథ్ తలకు తీవ్రగాయం కాగా, వినోద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఏక్‌నాథ్ మృతి చెందాడు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుదాస్ గంట తర్వాత చనిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రిమ్స్ చేరుకున్నారు. ఇద్దరు మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఒకరు అనారోగ్యంతో, ఒకరు రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడంతో లింగాపూర్, గ్రామంలో, ఇరుకుటుంబాల్లో విషాదం నెలకొంది. కాగా గ్రామస్తులు ఇరువురి అంత్యక్రియలు ఒకేసారి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ కె.రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ సివిల్, ఐటీఐ ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, కోప, స్టెనో, వెల్డర్ విభాగాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని, దరఖాస్తు సమయంలో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లను స్కాన్ చేసి iti.telangana. gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. ఈనెల 10 నుంచి 19 తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9490202037 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రెండు ట్రావెల్స్ బస్సులు సీజ్



అధికారులు సీజ్ చేసిన బస్సు

ఆదిలాబాద్‌టౌన్: పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రవాణా శాఖాధికారులు సోమవారం రాత్రి సీజ్ చేశారు. హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్, మరో ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్తున్న క్రమంలో గుడిహత్నూర్ సమీపంలో అసిస్టెంట్ ఎంవీఐ శ్రీకాంత్ తనిఖీ చేయగా.. ఒక్కో బస్సులో వంద మందికిపైగా తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెండు ట్రావెల్స్‌లను సీజ్ చేసి, వాటిని జిల్లా కేంద్రంలోని బస్‌డిపోకు తరలించారు. ప్రయాణికులను ఆదిలాబాద్ బస్టాండ్‌లో వదిలిపెట్టడంతో ఇబ్బంది పడ్డారు. ఒక్కొక్కరి నుంచి బస్సు యజమానులు రూ.3వేలు తీసుకున్నారని వాపోయారు. తమ రాష్ట్రానికి వెళ్లేందుకు డబ్బులు లేవని కన్నీరుమున్నీరయ్యారు.

ఎస్సైపై దాడిచేసిన వారికి జైలు

ఇంద్రవెల్లి: ఎస్సైపై దాడిచేసిన కేసులో ఎనిమిది మంది నిందితులకు జైలుశిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పి.శివరాంప్రసాద్ తీర్పునిచ్చినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2019లో ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్‌లో కేసు విచారణ కోసం వెళ్లిన అప్పటి ఎస్సై ఎ.గంగారాంపై అదే గ్రామానికి చెందిన 8 మంది దాడి చేశారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. వీరిలో పెలియ ఘన్‌శ్యామ్, రాజేశం, పూల్‌సింగ్, విష్ణు, అంజన్, అపర్ణ, రాము, సైనబాయిలు దాడికి పాల్పడ్డారు. అప్పటి ఉట్నూర్ డీఎస్పీ వెంకటేశ్ చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో 14 మంది సాక్షులను పీపీ కిరణ్‌కుమార్ కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైందని తెలిపారు. ఈ మేరకు జడ్జి ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.30వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు వివరించారు.

తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల కీలక పాత్ర

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి


కలెక్టర్ వర్సెస్ పోలీస్ క్రికెట్లో నిలిచిన కలెక్టర్‌కు బహుమతి అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ టౌన్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సురక్ష దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం ఎస్పీ, కలెక్టర్ జట్ల మధ్య క్రికెట్ పోటీని నిర్వహించగా, ఎస్పీ టీం 115 పరుగులు తీయగా, కలెక్టర్ టీం 85 పరుగులకే ఆలౌట్ అయింది. ఎస్పీ టీం విజేతగా నిలిచింది. సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పోలీస్ శాఖను పటిష్టం చేశారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం అనేక మార్పులు చేశారని తెలిపారు. ప్రత్యేకంగా పోలీస్ రిక్రూమెంట్ బోర్డు ఏర్పాటు చేసి పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. నిర్మల్ పట్టణంలో మరో పట్టణ స్టేషన్‌తోపాటు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూడా అవసరం ఉందన్నారు. త్వరలో వాటి ఏర్పాటుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. పట్టణంలో 100 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ సీహెచ్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీసుల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. ఆపదలో ఆందోళన చెందకుండా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఉదయం నిర్వహించిన 2కే రన్ విజేతలకు, క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌కు, పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ మల్లేశ్, పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రథయాత్రను ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి దంపతులు

రథయాత్ర ప్రారంభం

నిర్మల్‌ఖిల్లా: గండిరామన్న దత్తసాయి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని చింతకుంటవాడ హనుమాన్ మందిరం నుంచి గండి రామన్న ఆలయం వరకు నిర్వహించే రథయాత్రను మంత్రి ఐకేరెడ్డి దంపతులు సోమవారం ప్రారంభించారు. రథానికి పూజలు చేశారు. అంతకుముందు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. శోభాయాత్రలో మహిళలు మంగళ హారతులతో ప్రధాన వీధుల గుండా రథయాత్ర కొనసాగింది. గండి రామన్న ఆలయ ట్రస్టీ లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

పాముకాటుకు యువకుడి మృతి

బోథ్: పాముకాటుతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లాల రాజేందర్ (26) గత శనివారం తన అన్న రవీందర్‌తో కలిసి రాత్రి చేనుకు వెళ్లాడు. ట్రాక్టర్‌తో దుక్కి దున్నిస్తున్నాడు. ఆ సమయంలో అతని కాలిపై పాముకాటేసింది. గమనించిన రవీందర్ వెంటనే బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. తల్లి గంగమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గంగారెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

బోథ్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై గంగారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన గుండం భోజన్న (57). ఆయనకు 38 గుంటల భూమి ఉంది. ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పు తీసుకున్నాడు. వడ్డీకి వడ్డీ పెరిగిపోవడంతో ఐదేళ్ల నుంచి రూ.5 లక్షల అప్పులు అలానే ఉన్నాయి. అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపం చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత..


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: భర్త వేధింపులు తాళలేక వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై దిలీప్ కథనం ప్రకారం.. మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన త్యాపెల్లి స్వప్న(27) 15 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన బాలుతో వివాహమైంది. గత కొన్నేళ్లుగా భర్త ఆమెను వేధించసాగాడు. భరించలేని స్వప్న సోమవారం ఇంటి ముందు ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

మహిళను లైంగికంగా వేధించిన వ్యక్తికి రిమాండ్

నిర్మల్‌టౌన్: మహిళలను లైంగికంగా వేధించిన కేసులో ఒకరికి జిల్లా జ్యుడీషియల్ న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఈద్గామ్, చిక్కడపల్లికి చెందిన షేక్ సమీర్ స్థానిక మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఓ మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అట్రాసిటీ కేసు నమోదు చేసి పట్టణ సీఐ మల్లేశ్ దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

వాహనం బోల్తా

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ సమీపంలో నర్సాపూర్(జి) ఎస్సై రవీందర్ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొనడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో డివైడర్ నుంచి బైక్ ఒక్కసారిగా వస్తుండగా ఆ సమయంలో ఎస్సై వాహనం తప్పించబోయి బోల్తాపడింది. ఎస్సైకి స్వల్ప గాయాలయ్యాయి. వాహనంలో ఉన్న మరో ముగ్గురు పోలీసులు క్షేమంగా బయటపడ్డారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి


అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

- డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీల సత్వరం పరిష్కరించాలని డీడీ డా. దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు తదితరులు పాల్గొన్నారు.

- తనకు కులపత్రం మంజూరు చేయించాలని ఉట్నూర్ మండలం వేణునగర్ గ్రామానికి చెందిన రాథోడ్ రాజు విన్నవించాడు.
- ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ఉట్నూర్‌లో అడ్మిషన్ ఇప్పించాలని గాదిగూడ మండలం పర్సవాడకు ఎందిన సిడాం అనిత విన్నవించింది.
- రైతుబంధు ఇప్పించాలని ఉట్నూర్ మండలం లక్సెట్టిపేట్ గ్రామానికి చెందిన మడావి షేకు అర్జీ అందించారు.
- ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం కల్పించాలని ఉట్నూర్ గ్రామానికి చెందిన ఆర్.అపర్ణ విన్నవించింది.